ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

3

శనివారం 29 మార్చి 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శనివారం సాయంత్రం)	సెహరీ (ఆదివారం ఉదయం)
కడప	6.31	4.58
ప్రొద్దుటూరు	6.32	5.02

11న బీసీ రుణమేళా

● బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ



ఫటాఫట్

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ పరిధిలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులకు సంబంధించిన పత్రాల పరిశీలన పూర్తయిందని బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ పేర్కొన్నారు. ఇప్పటికే దరఖాస్తులు బ్యాంక్ అధికారులకు పంపించామని, ఏప్రిల్ 11న లబ్ధిదారులకు రుణాలు పంపిణీ చేస్తామని అన్నారు. ఆ రుణాలకు సంబంధించి బీసీ కార్పొరేషన్ ఈడీతో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ..

ప్రశ్న: రుణాలకు ఎన్ని దరఖాస్తులు అందాయి?

జవాబు: ఓబీఎంఎంఎస్ కింద 1,550 యూనిట్లకు 22వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. 18వేల మంది హాజరయ్యారు. 32 జనరిక్ షాపులకు 80 మంది దరఖాస్తు చేసుకోగా 60 మంది హాజరయ్యారు. కాపు రుణాలకు సంబంధించిన 379యూనిట్లకు 28వేల మంది దరఖాస్తు చేసుకోగా 2,500 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈబీసీ రుణాలకు సంబంధించి 240 యూనిట్లకు 3వేల మంది దరఖాస్తు చేసుకోగా.. 2వేల మంది హాజరయ్యారు.

ప్రశ్న: ఇంటర్వ్యూలు ముగిశాయా?

జవాబు: జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో ఇంటర్వ్యూలు పూర్తయ్యాయి. దరఖాస్తులు ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ లాగిన్ నుంచి బ్యాంకు అధికారులకు పంపించాం.

ప్రశ్న: లబ్ధిదారుల ఎంపిక ఎలా చేస్తారు?

జవాబు: బ్యాంకు అధికారులు అర్హులైన వారి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి యూనిట్ల స్థాపన, సాధ్యాసాధ్యాలను గమనిస్తారు. రుణాల రికవరీని కూడా దృష్టిలో ఉంచుకొని లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. బ్యాంకు అధికారులు ఈ నెలాఖరులోపు లబ్ధిదారుల జాబితాను మాకు పంపుతారు. జ్యోతిరావు పూలే వర్ధంతి రోజైన ఏప్రిల్ 11న రుణాలు అందజేస్తాము.

● పోలీసులకు సవాల్‌గా కానిస్టేబుల్‌పై హత్యాయత్నం కేసు
● ఆరు నెలలు దాటినా వీడని మిస్టరీ ● ఈ ఘటనపై రకరకాలుగా ప్రచారం

దమ్ముంటే పట్టుకోండి చూద్దాం..!



సాధారణంగా జనాలకు పోలీసులంటే భయం. వారి జోలికి ఎవరూ పోరు. అలాంటిది ఏకంగా పోలీసుపైనే హత్యాయత్నం చేయడమంటే మామూలు విషయం కాదు. ఈ ఘటన జరిగి ఆరునెలలు దాటినా ఇప్పటి వరకూ నిందితులను పట్టుకోలేదు. అసలు హత్యాయత్నం ఎందుకు జరిగిందో కూడా తేల్చలేదు.

(కడప-ఆంధ్రజ్యోతి): కడప పోలీసులకు రాష్ట్రంలోనే పెద్ద పేరుంది. కత్తులతో కుత్తుకలు కోసిన ఫ్యాక్షనిస్టుల పీచమణిచారు. పేరు మోసిన బడా ఎర్రచందనం స్మగ్లర్లు కలుగులో దాక్కున్నా లాక్కొచ్చి చట్టం ముందు నిలబెట్టారు. ఎన్నో సంచలనాత్మక కేసులను ఇన్వెస్టిగేట్ చేసి ఛేదించారు. అంత పేరున్న మన పోలీసులకు ఇప్పుడు ఆ శాఖలో కానిస్టేబుల్ హత్యాయత్నం కేసు ఓ సవాల్‌గా మారింది. ఆరునెలలు కావస్తున్నా ఆ కేసు ఇంకా చిక్కుముడి వీడలేదు. సొంత శాఖలో కానిస్టేబుల్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో మిస్టరీ వీడకపోవడంపై అటు జనాల్లో ఇటు పోలీసుశాఖలో విస్తృతంగా చర్చ నడుస్తోంది.



సంఘటన స్థలంలో హత్యాయత్నానికి గురైన కానిస్టేబులు శ్రీనివాసరెడ్డి (ఫైల్‌ఫొటో)

అసలేం జరిగిందంటే

వేంపల్లె పోలీసుస్టేషన్‌లో కె.శ్రీనివాసరెడ్డి కానిస్టేబుల్ (పీసీ నెం.698)గా పనిచేస్తున్నారు. ఇతను కోర్టు కేసులు చూసుకునేవారు. ఓ కోర్టు కేసు నిమిత్తం గత ఏడాది సెప్టెంబరు 30న అమరావతిలో విచారణకు హాజరయ్యేందుకు ఆయన 29వ తేదీ రాత్రి కారులో బయలుదేరారు. మార్గమధ్యంలోని యోగివేమన యూనివర్శిటీ సమీపంలో ఎగువపల్లె క్రాస్ వద్ద మోటారు బైకులో వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తులు కారును ఢీకొట్టే ప్రయత్నం చేయగా శ్రీనివాసరెడ్డి కారును పక్కకు తిప్పారు. అయినా వారు అడ్డుకున్నారు. మరో కారులో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. కానిస్టేబుల్ బ్యాగులో ఉన్న రూ.40లక్షలు నగదు తీసుకున్నారు. వారి కారులో ఉన్న సామిషన్ తెచ్చి కదిలితే కాళ్లు కట్ చేస్తామని కానిస్టేబుల్‌ను బెదిరించారు. అనుకోకుండా ఆ మిషను తగలడంతో శ్రీనివాసరెడ్డి రెండు కాళ్లు చీలమండల వరకు తెగాయి. ఆ తరువాత వ్యక్తులు కానిస్టేబుల్ కారులో పెట్రోలు పోసి అగ్నిప్రమాదంగా సృష్టించి పొదల్లోకి నెట్టేసి, డబ్బులు దోచుకుపోయినట్లు బాధితుడు శ్రీనివాసరెడ్డి గత ఏడాది అక్టోబర్ 3వ తేదీన పెండ్లిమర్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన అప్పట్లో సంచలనం రేపింది. కానిస్టేబుల్ కాళ్లు కట్ చేసి రూ.40లక్షలు దోచుకెళ్లడంతో పోలీసులఅందరూ ఉలిక్కిపడ్డారు. పోలీసుకు కాళ్లు కట్ చేసిన ఘటన జిల్లాలో ఎప్పుడూ జరగలేదు.

ముందుకు కదలని దర్యాప్తు

శ్రీనివాసరెడ్డి కానిస్టేబులు అయినప్పటికీ ఆయన అంతకు మించి వ్యవహరించేవారని అంటారు. వైసీపీ హయాంలో పులివెందులకు చెందిన వైసీపీ బాస్‌తో సత్సంబంధాలు పెట్టుకుని బాగా శాసించారంటారు. ఇక ఈ హత్యాయత్నం వెనుక రకరకాల ప్రచారాలు చక్కర్లు కొట్టాయి. భారీ ఎత్తున ఆర్థిక లావాదేవీల కారణంగానే ఈ ఘటన జరిగినట్లు చర్చ నడిచింది. ఎర్రచందనం, రియల్ ఎస్టేట్, సెటిల్‌మెంట్లు.. ఇలా రకరకాల వార్తలు బయటకి వచ్చాయి. పులివెందుల ప్రాంత కీలక నేతలే కాకుండా కొందరు పోలీసుల పాత్రపై కూడా అనుమానాలు వచ్చాయి. ఆర్థిక లావాదేవీల కారణంగానే ఈ ఘటన జరిగినట్లు అప్పట్లో చర్చ నడిచింది.

శ్రీనివాసరెడ్డి కానిస్టేబులే అయినా రకరకాల ఇష్యూలలో తల దూర్చేవారని పోలీసు వర్గాల్లో ప్రచారం ఉంది. వేంపల్లె సర్కిల్‌లో పనిచేసే సీఐలను కూడా మేనేజ్ చేస్తూ చక్రం తిప్పారని అంటారు. కానిస్టేబుల్ అయినప్పటికీ ఆ ప్రాంతంలో ఓ వెలుగు వెలిగిన శ్రీనివాసరెడ్డిపై హత్యాయత్నం పెద్దసంచలనంగా మారింది. ఇప్పటికీ ఈ కేసు ముందుకు కదలడంలేదు. ఎన్నో క్లూ లేని కేసులను కూడా ఛేదించిన సంఘటనలున్నాయి. ఖండాంతరాల్లో ఉన్న వారిని తెచ్చి జైల్లో వేశారు. మరి కానిస్టేబుల్‌పై హత్యాయత్నం జరిగి ఆరు నెలలు దాటినా దర్యాప్తు పూర్తికాలేదు. దీని వెనుక పెద్ద పెద్ద పేర్లే ఉన్నట్లు చర్చ నడుస్తోంది. మొత్తానికి ఈ కేసు పోలీసులకు సవాల్‌గా మారిందని చెప్పవచ్చు. ఈ కేసు గురించి పెండ్లిమర్రి సీఐ చల్లనిదొరను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. కేసు దర్యాప్తులో ఉందని అన్నారు.

మొక్కుబడిగా ప్రజాభిప్రాయ సేకరణ

● ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దాల్మియా పరిశ్రమ రెండో యూనిట్ ఏర్పాటు కోసం గురువారం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనలకు విరుద్ధంగా మొక్కుబడిగా సాగిందని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, బాధిత రైతులు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగు వైసీపీ కార్యాలయంలో బాధిత రైతులతో కలసి ఎమ్మెల్సీ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దాల్మియా యాజమాన్యం 15 సంవత్సరాలుగా రైతులందరిని మోసం చేస్తూ రావడానికి రెవెన్యూ అధికారులు ఇస్తున్న తప్పుడు రిపోర్టులే కారణమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ పబ్లిక్ ప్లేస్‌లో పెట్టాల్సింది పోయి దాల్మియా ఆవరణలోనే ఏర్పాటు చేయడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. రైతులు, ప్రజల సమస్యలు పట్టించుకోకుండా దాల్మియా యాజమాన్యం చెప్పిన ప్రకారంగా ప్రజాభిప్రాయ సేకరణ భారీ పోలీసు బందోబస్తుతో మొక్కుబడిగా నిర్వహించారన్నారు. ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దాల్మియా బాధిత రైతులు, సర్పంచు జగదీశ్వరరెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, దుగ్గనపల్లె గ్రామ బాధిత దళితులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులో తగ్గుతున్న నీటిమట్టం

కొండాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం ప్రారంభంలోనే గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గుతూ వస్తోంది. గండికోట ప్రాజెక్టుకు అనుబంధంగా ఉన్న రిజర్వాయర్లతో పాటు, సీపీడబ్ల్యూఎస్ లాంటి నీటి పథకాలకు నీరు వదులుతున్నారు. దీంతో గండికోటలో నీరు తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టు నుంచి 720 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ఎత్తిపోతల పథకానికి 300 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, నీటిపథకాలకు 120 క్యూసెక్కులు నీటిని వదులుతున్నట్లు ఈఈ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 23.160 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. కాగా ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

పోటాపోటీగా బార్‌అసోసియేషన్ ఎన్నికలు





అధ్యక్షునిగా ఎన్నికైన రాఘవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన చంద్రవదన

కడప రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కడప బార్ అసోసియేషన్‌లో శుక్రవారం నిర్వహించిన కడప న్యాయవాదుల సంఘం 2025-26 ఎన్నికలు పోటీపోటీగా కొనసాగాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 590 ఓట్లకు గాను 582 మంది న్యాయవాదులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఎన్నికలు నిర్వహించారు. 4 గంటలలోపు పోలింగ్ కేంద్రంలో ఉన్నవారందరికి ఓటు హక్కు కల్పించారు. అనంతరం కౌంటింగ్‌ను ప్రారంభించి రాత్రి 10గంటల తరువాత ఫలితాలు వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడిగా రాఘవరెడ్డి, ఉపాధ్యక్షురాలిగా ఎ.ఉమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వేదాల చంద్రవదన గెలుపొందారు.

రేషన్ దొంగల భరతం పట్టండి

● డీజీపీకి ఎమ్మెల్సీ వినతి

కడప, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ బియ్యం దొంగల భరతం పట్టాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి డీజీపీ హరీష్‌కుమార్ గుప్తకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తాడేపల్లిలో డీజీపీని కలిసి జిల్లాలో రేషన్ బియ్యం అక్రమార్కుల వివరాలతో కూడిన జాబితాను అందించారు. ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని అనేక సంవత్సరాల నుంచి అక్రమ రవాణా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వీరిపై జిల్లాలో అనేక స్టేషన్ల పరిధిలో రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులు ఉన్నాయని వివరించారు. ఎన్ని కేసులు నమోదు చేసినా వారు మాత్రం బియ్యం అక్రమ రవాణా కొనసాగిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో రేషను బియ్యం అక్రమ రవాణాకు పాల్పడకుండా కఠినచర్యలు తీసుకోవాలని అలాగే బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని డీజీపీని కోరారు.

1న సోషల్ పరీక్ష

కడప ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు సంబంధించి 31వ తేదీ సోమవారం జరగాల్సిన సోషల్ పరీక్ష ఏప్రిల్ 1న జరుగుతుందని డీఈవో షంషుద్దీన్ తెలిపారు. 31న రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిందన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గుర్తించాలని తెలిపారు.

ఎండలో.. నిదానంగా



భానుడు భగభగమంటున్నాడు. మండే ఎండలతో జనం సైతం బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ద్విచక్రవాహనాల్లో మార్కెట్‌కు వచ్చి పోవాలన్నా ఎండలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు ఎండ నుంచి రక్షణగా ద్విచక్రవాహనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అలా చేసుకున్న ఏర్పాట్లతో సుర్రుమనే ఎండల్లోనూ హాయిగా వెళుతున్న వాహనదారులు శుక్రవారం కడపలో కనిపించారు. వీరిని పలువురు ఆసక్తిగా తిలకించారు.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప



కాంగ్రెస్ పార్టీకి అఫ్జల్‌ఖాన్ రాజీనామా

కడప కలెక్టరేట్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ ఆ పార్టీకి, తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డికి గురువారం పంపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు.

క్లిక్.. క్లిక్... లంకమలలో కెమెరాలకు చిక్కిన వన్యప్రాణులు



లంకమలలో చింకారా జింక

సిద్దవటం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతంలోని కొండూరు బీట్‌లో అరుదైన జింక జాతికి చెందిన చింకారా అటవీ అధికారులు అమర్చిన కెమెరాకు చిక్కిందని ఫారెస్ట్ రేంజర్ కళావతి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం రేంజర్ కళావతి మాట్లాడుతూ పులుల గణనలో భాగంగా మార్చి 5న సిద్దవటం రేంజిలోని 7 ఫారెస్ట్ బీట్‌లలోని 64 లొకేషన్లలో 128 కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 24న కెమెరాలోని డేటాను సేకరించామని చెప్పారు. ఈ కెమెరాల్లో అరుదైన వన్యప్రాణులు, చింకారాతో పాటు చిరుత పులులు, ఎలుగుబంట్లు, నెమళ్లు, పునుగుపిల్లి, ముళ్ల పంది, కొండ గొర్రెలు, మచ్చల జింక, అడవి కుక్కలు, పలు రకాల పక్షులు ఇవన్నీ అటవీ ప్రాంతంలో పెట్టిన కెమెరాలకు చిక్కాయని తెలిపారు. ఏప్రిల్ 14న కెమెరాలోని డేటాను మరోసారి పరిశీలిస్తామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, బీట్ అధికారులు పాల్గొన్నారు.



నెమలి



చిరుతపులి సంచారం



అడవి కుక్కలు



ఎలుగుబంటి



నీరు తాగుతున్న కొండ దుప్పులు





సుర్రుమంటున్న సూరీడు

- ప్రారంభంలోనే భానుడి ఉగ్రరూపం
- ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలాగో ?
- జాగ్రత్త పడకపోతే ప్రమాదం

పీలేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా మార్చిలో ప్రారంభమయ్యే వేసవి తీవ్రత ఏప్రిల్‌లో పుంజుకుని మేలో పతాకస్థాయికి వెళుతుంది. కానీ ఈ ఏడాది మాత్రం భానుడు మార్చి ఆరంభం నుంచే తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం 8 గంటల నుంచే తన తీవ్రతను ప్రదర్శిస్తూ మధ్యాహ్నానికి విశ్వరూపం చూపుతున్నాడు. మార్చిలోనే ఎండలు ఇలా మండిపోతుంటే ఇక ఏప్రిల్, మే మాసాల్లో ఎలా అని సామాన్యులు జడుసుకుంటు న్నారు. అయితే అనివార్యమైన ఈ ఉపద్రవాన్ని ఉపాయంతో ఎదుర్కోవాలని, తగిన జాగ్రత్తలు పాటిస్తే వేసవి నుంచి సురక్షితంగా బయటపడ వచ్చని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

హీట్ ఎగ్జాషన్....

ఎండ వేడికి తట్టుకోలేకపోవడం వల్ల తీవ్ర నీరసం, నిస్సత్తువ, నిస్త్రాణ (హీట్ ఎగ్జాషన్) తలెత్తుతుంది. దాని కారణంగా చెమట విపరీతంగా పట్టి శరీరం చల్లబడుతుంది. రక్తపోటు పడిపోతుంది. అప్పుడు దాహం, కళ్లు తిరగడం, బలహీనత, ఏకాగ్రత కుదరకపోవడం, వికారం, మత్తుగా అనిపించడం వంటి సమస్యలు ఏర్పడతాయి. కొందరు దీన్ని వడదెబ్బగానూ పొరపడుతుంటారు. వడదెబ్బలో చెమట పట్టదు.



పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో సేద తీరుతున్న భవన నిర్మాణ కార్మికులు

వేడి నిస్త్రాణలో చెమట పడుతుంది. శరీర ఉష్ణోగ్రత మామూలుగానే ఉంటుంది. తాకితే చర్మం చల్లగానూ అనిపిస్తుంది. వెంట్రుకలు నిక్కబొడుచుకుంటాయి. నాడి వేగం పెరగొచ్చు లేదా మామూలుగానైనా ఉండొచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే వడదెబ్బకు దారి తీసే ప్రమాదముంది. శిశు వులు, చిన్నపిల్లలు, వృద్ధులకు వేడి నిస్త్రాణ ముప్పు ఎక్కువ. ఊబకాయులు, వేడిని తట్టుకోలేని వారికీ దీనివల్ల ముప్పు ఉంటుంది. నీరసం, బడలికగా అనిపిస్తే వెంటనే చల్లటి ప్రదేశానికి వెళ్లాలి. నీరు ఎక్కువగా తాగాలి. అనంతరం డాక్టర్‌ను సంప్రదించాలి.

కండరాలు పట్టేయటం...

కండరాలు సజావుగా పనిచేయటానికి సోడియం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి లవణాలు అవసరం. శరీరంలో వీటి మోతాదు తగ్గిపోతే కండరాల పనితీరు అస్తవ్యస్తమై, బిగుసు కుపోవచ్చు. దీంతో విపరీతమైన నొప్పి పుడుతుంది. చాలా వరకు పిక్క కండరాలు పట్టేస్తుంటాయి. చేతులు, కడుపు కండరాలూ పట్టేయచ్చు. కాళ్లు, చేతులు కొంకర్లు పోవచ్చు కూడా. ఎండలో ఎక్కువ సేపు గడపడం, నడవటం, వ్యాయామం, పనులు చేయడం వంటివి కండరాలు పట్టేయటానికి కారణ మవుతుంటాయి. అధిక రక్తపోటు, మధుమేహం గలవారికీ దీని ముప్పు ఎక్కువే. కండరాలు పట్టేసి నప్పుడు చల్లటి ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవడం ముఖ్యం. చల్లటి నీరు, పానీయాలు తాగాలి. నీటిలో కాస్త ఉప్పు, చక్కెర గానీ ఓఆర్ఎస్ పొడిని గానీ కలిపి తాగితే మంచిది. మజ్జిగలో ఉప్పు, నిమ్మరసం కలిపి అయినా తాగొచ్చు.

సొమ్మసిల్లడం...

ఎండలోకి వెళ్లినప్పుడు ఉన్నట్టుండి సొమ్మసిల్లడం (హీట్ సింకోపీ) మరో సమస్య. దీనికి కారణం మెదడుకు తగినంత రక్తం అందకపోవడం. చెమట పట్టే క్రమంలో చర్మానికి రక్త సరఫరా పెరుగు తుంది. అదే సమయంలో మెదడుకు తగ్గుతుంది. ఇది మనుషులను సొమ్మసిల్లేలా చేస్తుంది. తల తిప్పటం, తలనొప్పి, వికారమూ ఉండచ్చు. ఎండను తట్టుకోలేని వారికి, వృద్ధులకు, రక్తపోటును తగ్గించే బీటా బ్లాకర్ల రకం మందులు వేసుకునే వారికి, ఇతర దీర్ఘకాల సమస్యలు గలవారికి ముప్పు ఎక్కువ. సొమ్మసిల్లటం తాత్కాలికమే అయినా జాగ్రత్త అవసరం. ఎండకు స్పృహ తప్పిన వారిని వెంటనే నీడకు చేర్చాలి. రక్తపోటు బాగా తగ్గినా, మరీ నీరసంగా ఉన్నా ఆసుపత్రికి చేర్చాలి.

వడదెబ్బ...

ఇది చాలా తీవ్రమైన సమస్య. చెమట పట్టే క్రమంలో రక్తంలోని ద్రవం బాగా ఆవిరి అవ్వొచ్చు. ఇదిలాగే కొనసాగితే ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ కుప్పకూలుతుంది. చివరికి చెమట పట్టడమూ ఆగిపోతుంది. ఇదే వడదెబ్బ. కొందరికి 106 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత పెరగొచ్చు. ఇందులో చర్మం పొడిబారుతుంది. ముట్టుకుంటే శరీరం కాలుతుంటుంది. నీరు, రక్తం పరిమాణం తగ్గటం వల్ల రక్తపోటూ పడిపోతుంది. రక్తం గడ్డకట్టే ప్రక్రియ కూడా అస్తవ్యస్తమవుతుంది. క్రమంగా అవయవాలు విఫలమై కోమాలోకి వెళ్లిపోవచ్చు. ఫిట్స్ రావొచ్చు. పరిస్థితి మరీ విషమించి ప్రాణాపాయమూ సంభవించొచ్చు. చాలామంది ఎండలోకి వెళితేనే వడదెబ్బ తగులుతుందని భావిస్తుంటారు. కానీ వేడి గాలి, వేడి వాతావరణం ప్రభావంతో ఇంట్లో ఉన్నా వడదెబ్బ తగలవచ్చు.

చల్లబరచటం ప్రధానం

వడదెబ్బ తగిలిన వారి శరీరం చల్లబడేలా చూడడం ప్రధానం. ఎండలో ఉంటే వెంటనే నీడకు చేర్చాలి. బిగుతైన దుస్తులు, టెర్లిన్, పాలిస్టర్ దుస్తులు ధరిస్తే తొలగించాలి. వదులైన, కాటన్ దుస్తులు వేయాలి. గాలి బాగా ఆడేలా చూడాలి. తడి గుడ్డతో ఒళ్లంతా తుడవాలి. శరీరం మీద నీళ్లు గుమ్మరించి ఫ్యాను గాలి తగిలేలా చూడాలి. ఐస్ ముక్కలను ప్లాస్టిక్ బ్యాగులో వేసి ఒళ్లంతా అద్దాలి. వడదెబ్బ చాలా త్వరగా ప్రాణాపాయానికి దారి తీస్తుంది. కాబట్టి సత్వర చికిత్స అవసరం. ఆసుపత్రిలో ఐస్ బాత్, సెలైన్ ఎక్కించడం వంటి వాటి ద్వారా ఉష్ణోగ్రత తగ్గేలా చేస్తారు.

ముప్పు ఎవరికి...

చిన్నపిల్లలు, వృద్ధులకు దాహం వేసే విషయం అంతగా తెలియదు. దీంతో నీరు తగినంతగా తాగరు. స్వేదగ్రంథులు తక్కువగా ఉండడం వల్ల చెమట అంతగా పట్టదు. వయసు మీద పడ్డ వారిలో చాలామంది అధిక రక్తపోటు వంటి సమస్యలకు మందులు వేసుకుంటుంటారు కూడా. వీటితోనూ వడదెబ్బ ముప్పు పెరగొచ్చు.

ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి

- డాక్టర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, పీలేరు



వేసవిలో వచ్చే సమస్యలను అధిగమించాలంటే ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. నిమ్మరసం కలిపిన మజ్జిగ, ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, దోసకాయలు, పుచ్చకాయలు, చీనీకాయలు, దానిమ్మ వంటి పండ్లు తీసుకోవాలి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్యలో వృద్ధులు, చిన్నపిల్లలు బయటకు వెళ్లకపోతేనే మంచిది. వ్యాయామాలు కూడా ఉదయం 8 గంటలలోపు ముగించాలి. వేసవిలో మద్యపానం, మసాలా పదార్థాల జోలికి వెళ్లకపోవడం మంచిది.



నిర్మానుష్యంగా ఉన్న పీలేరు పాతబస్టాండు

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి హామీ పనులను పరిశీస్తున్న పీడీ ఆదిశేషారెడ్డి

సిద్దవటం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహిస్తున్న తోటల పెంపకం, గోకులం షెడ్ల పనులను ఉపాధి పీడీ ఆదిశేషారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలోని శాఖరాజుపల్లె, ఉప్పరపల్లె, చాముండేశ్వరిపేటల్లో ఆయన పర్యటించారు. ఉపాధిహామీ నిధులతో సాగు చేస్తున్న ఫైర్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. శాఖరాజుపల్లెలో గోకులం షెడ్డు నిర్మాణాన్ని, ఉప్పరపలెలో ఫారంపాండ్ పనులను పరిశీలించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని కూలీలు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు మాత్రమే పనులు చేయాలని, కూలి మొత్తం పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నరసింహులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రేపటి నుంచి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

నందలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : స్మాషర్స్ షటిల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈనెల 30, 31 తేదీల్లో అన్నమయ్య, కడప జిల్లా స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్, నాన్ మెడలిస్ట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నందలూరు రైల్వే కేంద్రంలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో టోర్నమెంట్ నిర్వహించనున్నామని, ఔత్సాహిక క్రీడాకారులు ఈనెల 29వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి 7 వేలు, రెండో బహుమతి 5 వేలు, మూడో బహుమతి 3 వేలు, నాలుగో బహుమతి 2 వేలతోపాటు షీల్డ్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతిఒక్కరికి మెడల్స్ ఇస్తామని, ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్మాషర్స్ షటిల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వేసవిలో లేగదూడలను సంరక్షించుకోవాలి



వెలిగల్లులో లేగ దూడల ప్రదర్శనలో మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై

పెద్దమండ్యం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వేసవిలో లేగ దూడలను సంరక్షించుకోవాలని పాడి రైతులకు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై పిలుపునిచ్చారు. మండలంలోని వెలిగల్లులో రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవులకు పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లేగ దూడల జాతి లక్షణాలు, శరీర బరువు, యాజమాన్య పద్ధతులు వివరించారు. దూడల బరువును వాటి ఆరోగ్య పరిస్థితిని గుర్తించాలన్నారు. మేలు జాతి లేగ దూడల సంరక్షణ పద్ధతులు అవలంబించిన రైతులకు ప్రోత్సాహక బహుమతులును అందజేశారు. వేసవిలో పచ్చి గడ్డి మేతకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బాలసుబ్రమణ్యం, మదనపల్లి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్ సుమిత్ర, పెద్దమండ్యం, తంబళపల్లి పశు వైద్యాధికారులు విక్రమ్‌రెడ్డి, ఉస్మాన్, సుజన, సర్పంచ్ సరస్వతి, రైతులు పాల్గొన్నారు.

ఐదు ఎక్స్‌కవేటర్లు సీజ్



సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్లు

వాల్మీకిపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్న ఐదు ఎక్స్‌కవేటర్లను శుక్రవారం పోలీసు, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. వాల్మీకిపురం పట్టణానికి భోగంపల్లె రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా జరుగుతోందని, అక్క ఇసుక తవ్వకాలను ఉపేక్షించేది లేదంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అయినా శుక్రవారం వేకువన కొందరు ఇసుక తరలిస్తున్నట్లు ఫిర్యాదులందాయి. దీంతో దాడులు నిర్వహించి ఇసుక తవ్వుతున్న 5 ఎక్స్‌కవేటర్లు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఒంటరి మహిళపై దాడి

- ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్న బాధితులు



చికిత్స పొందుతున్న లక్ష్మి

పెద్దతిప్పసముద్రం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణ కోసం కిరాణా దుకాణం నడుపు కుంటున్న ఒంటరి మహిళపై కొందరు వ్యక్తులు దాడి చేసి గాయపర్చిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సంఘటన పెద్దతిప్ప సముద్రం మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. కాట్నగల్లు హరిజనవాడకు చెందిన పెద్దకొండిగాళ్ల సూరప్ప కూతురు లక్ష్మి భర్త చనిపోవడంతో పుట్టింట్లోనే ఉంటోంది. కుటుంబాన్ని పోషించుకునేందుకు తన ఇంటి పక్కనే ఉన్న ఖాళీ జాగా ఓ బంకు ఏర్పాటు చేసుకుంది. ఆ బంకు తమ స్థలంలో ఉందంటూ ఈ నెల 23 సాయంత్రం ఇదే గ్రామానికి చెందిన కొమ్ము వెంకట్రమణ తన కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మి అమె కుటుంబ సభ్యులతో గొడవపడి, దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన కూతురిని మదనపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు సూరప్ప తెలిపాడు. గంగజాతర బందోబస్తులో ఉన్నామని జాతర అయిపోగానే ఇరువర్గాలను పిలిపించి న్యాయం చేస్తామని ఎస్‌ఐ తెలిపారని, దాడి జరిగి నాలుగు రోజులు అవుతున్నా కనీస చర్యలు తీసుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



రామాంజనేయులు (ఫైల్ ఫొటో)

రాజంపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పుల్లంపేట మండలం బావికాడపల్లెకు చెందిన ఫొటో స్టూడియో యజమాని రామాంజనేయులు (29)గా గుర్తించారు. అ ప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కొందరు, వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్లు మరికొందరు చెబు తున్నారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెట్టుకు ఉరి వేసుకొని పూజారి ఆత్మహత్య

బి.కొత్తకోట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ పూజారి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని బడికాయలపల్లె బీసీ కాలనీకి చెందిన తలారి కృష్ణప్ప(58) అదే గ్రామంలోని ఈరమద్దెమ్మ గుడికి పూజారిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని ఓ చింతమానుకు ఉరి వేసుకున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు వున్నారు. కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కొడుకు వీరభద్ర పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ జీవన్‌గంగానాథ్‌బాబు తెలిపారు. మృతదేహాన్ని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వివాదాస్పద భూమి పరిశీలన




బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

రామసముద్రం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం ఎర్రనేలపల్లెలోని వివాదాస్పద భూమిని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ శుక్రవారం పరిశీలించారు. సర్వే నెంబర్ 218/1సీ లోని 2.75 సెంట్ల ప్రభుత్వ భూమి విషయంలో ఆరునెలలుగా లక్ష్మమ్మ, పార్వతమ్మల మధ్య వివాదం నెలకొంది. ఈ విషయంపై లక్ష్మమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ వివాదాస్పద భూమిని పరిశీలించారు. రామసముద్రం తహసీల్దార్ నిర్మలాదేవి, డివిజనల్, సర్వేయర్ దిలీప్‌కుమార్ సమక్షంలో సర్వే చేసి బాధిత మహిళ లక్ష్మమ్మకు స్వాధీనం చేశారు. అయితే పార్వతమ్మ ఇందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొన్నేళ్లుగా ఈ భూమి తన అనుభవంలో ఉందని, ఈ భూమి లేకపోతే ఎలా బతకాలని సబ్‌కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఈ భూమికి బదులుగా వేరొక చోట భూమి ఇస్తామని చెప్పారు. అనంతరం మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీలో భూ రీసర్వేను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. అరికెల పంచాయతీ చిట్టెంవారిపల్లెలో దారి విషయంలో గ్రామస్తుల మధ్య నెలకొన్న వివాదంపై మాట్లాడి ఇరువర్గాలకు ఆమోదయోగ్యంగా సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తామని తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట

- పురుషులకు డ్వాక్రా తరహా సంఘాలు
- మెప్మా పీడీ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్

మదనపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మెప్మా పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మెప్మా కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, రీసోర్స్ పర్సన్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ..మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా కొత్త పథకాలను తీసుకొస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లో కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలని, పది మందికి తక్కువగా ఉన్న గ్రూపుల్లో కొత్త వారిని చేర్చాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన పురుషులు, చేతివృత్తిదారులకు సంఘాలు ఏర్పాటు చేసి రుణాలు ఇవ్వాలని సూచించారు. పురుషుల సంఘాలకు తమ వృత్తిలో నైపుణ్యాలు పెంచుకునే విధంగా రుణాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తారన్నారు. ముఖ్యంగా. పేద, మధ్య తరగతి ప్రజలు, పలు రంగాల్లో పనిచేసే కార్మికులను గ్రూపుల్లో చేర్చడం ద్వారా ఆర్థికంగా పురోగతి సాధించాలని సంఘ సభ్యులు, ఆర్పీలకు సూచించారు. అనంతరం మహిళల ఆరోగ్యం, సమాజంలో వారి పాత్ర, నడవడిక, కుటుంబ ఆరోగ్యం, పిల్లల పెంపకం, తదితర వ్యక్తిగత, సామాజిక అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమీషనర్ కే.ప్రమీల, సీఎంఎం మధుసూధన్‌రెడ్డి, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లెలో చోరీ



దుండగులు పగులగొట్టిన బీరువా

సిద్దవటం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లె సాయినగర్‌లో నివాసం ఉన్న రఘురామయ్య గృహంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి కథనం మేరకు రఘురామయ్య భార్య లీలావతి 10 రోజులుగా హైదరాబాదులోని తన కుమారుల సాయంతో అక్కడి అంకుర ఆస్పత్రిలో చికిత్స పొందు తోంది. మార్చి 26న బుధవారం రాత్రి రఘురామయ్య భార్యను చూసేందుకు హైదరాబాదుకు వెళ్లాడు. ఆ సమ యంలో గుర్తు తెలియని వ్యక్తులు తన ఇంట్లో చోరీ చేశారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీరువాలో దాచిన రూ.45 వేల నగదు, నాలుగు జతల కమ్మలు, ఒక చైను తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో పోలీ సులు క్లూస్ టీం సాయంతో సంఘటన స్థలంలో తనిఖీ చేశా రు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

జాబ్ మేళాతో ఉద్యోగ కల్పన

తంబళ్లపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు పొందడానికి జాబ్ మేళా చక్కటి వేదికని ప్రభుత్వ ఐటీఐ టీవో నాగరాజు అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివిన యువత హాజరయ్యారు. వీరికి ముత్తూట్ ఫైనాన్స్ హ్యూండయ్ మొబైల్ కంపెనీ ప్రతినిధులు కళ్యాణ్, రవితేజ ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ చూపిన ఏడుగురిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా టీవో మాట్లాడుతూ..నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య, ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లు సురేంద్ర, రమణ, అశోక్, యువత పాల్గొన్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని ఈ సందర్భంగా నిర్వాహకులు అభినందించారు.

ఉగాది సందర్భంగా కవులకు సత్కారం



కవులను సత్కరించిన ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్

రాజంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగను పురస్కరించుకుని అన్నమయ్య జిల్లాలోని పలువురు కవులను శుక్రవారం నెల్లూరుకు చెందిన కేంద్ర ప్రభుత్వ ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం వారు ఘనంగా సత్కరించారు. నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజంపేట తెలుగు పండితులు, కవి, రచయిత గంగనపల్లి వెంకటరమణ , ఉపాధ్యాయుడు, ప్రముఖ ఇంద్రజాలికుడు యూపీ రాయుడు, చిట్వేలికి చెందిన కవి, ఉపాధ్యాయులు దొండ్లవాగు శ్రీనివాసులు, తాళ్లపాక గ్రామానికి చెందిన కవి బాలరాజు జనార్దన్‌రాజు సన్మానం అందుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఉగాది లక్ష్మికి స్వాగతం, శుభ స్వాగతం పేరిట గంగనపల్లె వెంకటరమణ, ఓ మనిషీ.. ఇక మిగిలేదేముంది.. చెప్పేదేముందంటూ యూపీ రాయుడు గేయ కవిత, ఒక్క వాన పేరుతో చిట్వేలికి చెందిన ఉపాధ్యాయుడు దొండ్లవాగు శ్రీనివాస్, ఉగాది ఆకాంక్షల పేరుతో బాలరాజు జనార్దన్‌రాజు ఆలపించిన కవితలు అలరించాయి.

అలరించిన అన్నమయ్య సంకీర్తనల ఆలాపన



సంకీర్తనలను ఆలపిస్తున్న కళాకారులు

రాజంపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పదకవితా పితామహుడు తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమాచార్యుల 522వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సంగీతసభ , హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది. రాజంపేట మండలం మండలం తాళ్లపాక ఆర్చి అన్నమయ్య ఉద్యానవనంలోని అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు కె.సుబ్రమణ్యం, సి.దేవికాబృందం, సంగీత సభ నిర్వహించారు. జీఎన్‌కే సీతాలక్ష్మీ బృందం హరికథ కాలక్షేపం నిర్వహించారు.


నిత్యపూజ ఆలయ హుండీలోని కానుకల లెక్కింపు



హుండీలోని కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

సిద్దవటం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిత్యపూజ ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 27 నుంచి మార్చి 28 వరకు హుండీలోని కానుకలు లెక్కించగా రూ. 72,470 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జనార్దన్, హెడ్‌కానిస్టేబుల్ రమణ, ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు సిబ్బంది, ఫీల్డ్ ఆఫీసర్ సురేంద్రబాబు, మెసెంజర్ సతీష్, జ్యోతి, వెంకటసుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, అర్చకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మునిగోపాల్ కృష్ణకు డాక్టరేట్



డాక్టరేట్ పట్టాతో మునిగోపాలకృష్ణ

మదనపల్లె అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఢిల్లీ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ డే స్ప్రినిక్ ఇంటర్‌నేషనల్ యూనివర్సిటీ వారు ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడుమునిగోపాల్‌కృష్ణకు శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. హైదరాబాదులో బిర్లా ప్లానిటోరియం ఆడిటోరియంలో ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మునిగోపాల్ కృష్ణ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సమస్యలపై తన భార్య ధనలక్ష్మి నిర్మాణంలో కనువిప్పు, ఆవేదన లఘుచిత్రాలు తీశానన్నారు . కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి, జనరల్ సెక్రటరీ రామచంద్రరావు, మో తుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



పగడాల చంద్రకుమార్, ఇన్‌సెట్‌లో చంద్రకుమార్ (ఫైల్)

బద్వేలుటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక పురుగుల మందు తాగి శుక్రవారం పగడాల చంద్రకుమార్ (36) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని పెద్దఅగ్రహారంలో నివాసం ఉండే చంద్రకుమార్ అప్పులు ఎక్కువ చేశాడు. ఈ నేపథ్యంలో అప్పులు ఇచ్చిన వారి నుంచి వేధింపులు పెరగడంతో.. ఆ బాధను భరించలేక బుధవారం ఇంటి నుంచి వెళ్లిపోయి శుక్రవారం పట్టణంలోని నెల్లూరురోడ్డులో ఉన్న ఓ లాడ్జిలో పురుగులమందు తాగి మృతి చెందాడు. మృతుడు ఉన్న గది నుంచి దుర్వాసన రావడంతో అక్కడ పనిచేసే సిబ్బంది వెళ్లిచూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, మృతుడు చంద్రకుమార్‌కు అదే గ్రామానికి సుమతితో వివాహమైంది. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీ.. వృద్ధురాలు మృతి



కడప క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఉక్కాయపల్లె సమీపంలోని బైపాస్ రోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు కడప ట్రాఫిక్ సీఐ జావీద్ తెలిపారు. గురువారం రాత్రి నడుచుకుంటూ వెళుతున్న ఆమెను వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడి కక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతి చెందిన వృద్ధురాలికి 65 సంవత్సరాలు ఉంటుందని, ఇతర వివరాల కోసం 9121100539 లేదా కడప ట్రాఫిక్ పోలీసుస్టేషన్ వచ్చి తెలుసుకోవాలని సీఐ తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య



రాజశేఖర్ మృతదేహం

కడప క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామరాజుపల్లెలోని ఎస్సీ కాలనీకి చెందిన రాజశేఖర్ (24) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాలుకా సీఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. రాజశేఖర్ డిగ్రీ బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గత ఏడాది నుంచి కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. కడుపు నొప్పి తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

గోపవరం ఉపసర్పంచ్ ఎన్నికకు బ్రేక్

- ఎన్నిక నిర్వహణాధికారికి అస్వస్థత
- వాయిదా వేసిన అధికారులు



వార్డు మెంబర్లను తనిఖీ చేసి ఎన్నికల కేంద్రంలోకి పంపుతున్న పోలీసులు, అస్వస్థతకు గురైన రామాంజనేయులరెడ్డిని ఆస్పత్రికి తరలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం ఉపసర్పంచ్ ఎన్నిక సందర్భంగా గురువారం చోటు చేసుకున్న హింసాత్మక ఘటన నేపథ్యంలో కోరం లేకపోవడంతో అధికారులు వాయిదా వేసిన విషయం తెలిసిందే. శుక్రవారం చేపట్టిన ఎన్నికకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి వార్డు మెంబరును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఒక్కొక్కరిని ఎన్నిక కేంద్రంలోకి అనుమతించారు. ఉదయం 11 గంటల నుంచి ఈ ఎన్నిక ప్రక్రియ మొదలైంది. జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ప్రొద్దుటూరు తహసీల్దారు గంగయ్య ఎన్నిక సరళిని పరిశీలించారు. కాగా, ఎన్నిక కేంద్రంలో వార్డు సభ్యుల మధ్య గతంలో కుదుర్చుకున్న ఒప్పంద వ్యవహారమై వాగ్వాదం చోటు చేసుకుంది. బీసీ అభ్యర్థిని ఉపసర్పంచుగా ఎన్నుకోకపోవడానికి కారణం మీరంటే మీరని ఒకరిపై ఒకరు ఆరోపిస్తూ వాగ్వాదానికి దిగడంతో కొంత ఘర్షణ వాతవాతరణం నెలకొంది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణ అధికారి, ఈవోపీఆర్డీ రామాంజనేయులరెడ్డి అస్వస్థతకు లోనయ్యారు. చాతినొప్పి రావడంతో హుటాహుటిన ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ పరిణామాలను జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో వారి ఆదేశాల మేరకు ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు గోపవరం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ అధికారికంగా ప్రకటించారు. కలెక్టర్ తదుపరి ఉత్తర్వుల ఆదేశానుసారం ఎన్నిక నిర్వహణ ఉంటుందని వెల్లడించారు. కాగా, ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు నేతృత్వంలో ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు, ప్రొద్దుటూరు డీఎస్పీ భావన ఆధ్వర్యంలో ముందస్తు చర్యలను చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, వైసీపీ నాయకులు బంగారు మునిరెడ్డి, ఆయిల్‌మిల్ ఖాజా, టీడీపీ నాయకులు మురళీధర్‌రెడ్డి, బచ్చల పుల్లయ్యలను హౌస్ అరెస్టు చేశారు. ఎన్నిక సజావుగా సాగేందుకు కావాల్సిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టారు.

వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వమే శ్రేయస్కరం

- మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు

కడప రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వమే శ్రేయస్కరమని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్‌లు పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో శుక్రవారం 5వ రోజు న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యవర్తిత్వంలో న్యాయవాదుల పాత్ర కీలకంగా ఉండాలన్నారు. శిక్షణలో రిసోర్స్‌పర్సన్ తెలియజేసిన అంశాలపై అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. వాటిని కక్షిదారులకు తెలియపరిచి కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే వెసులుబాటును కల్పించాలన్నారు. మధ్యవర్తిత్వం వలన సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. న్యాయపరమైన మధ్యవర్తుల కోసం నైతిక సూత్రాలు, డాక్యుమెంటరీ, ఇంటరాక్టివ్ సెషన్, మధ్యవర్తిత్వం, రాజీ నియమాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పద్ధతులు తదితర విషయాలను తెలియపరిచారు. ప్రాథమిక నియమాలు, పయోజన అభ్యాసం, మధ్యవర్తిత్వ శిక్షణ తదితర వాటి గురించి రిసోర్స్ పర్సన్స్ పీజీ సురేష్, జి.జ్యోతిలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ అనంతరం జడ్జిలతో కలిసి గ్రూప్ ఫొటోలో న్యాయవాదులు

సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ



చిన్నచౌకు పోలీసుస్టేషన్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

కడప క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో శుక్రవారం సాయంత్రం సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాలతో ఎస్ఐఎస్ డయల్ టీన్‌యాడ్స్ వారి ద్వారా సైబర్ క్రైం ఇన్‌స్పెక్టరు మధుమల్లేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ క్రైం, ఏఆర్ సిబ్బంది చిన్నచౌకు పోలీసుస్టేషన్ నుంచి వాహనాల్లో ర్యాలీ చేశారు. ఈ ర్యాలీ అప్సరసర్కిల్, వైజంక్షన్, డాక్టర్ అంబేడ్కర్ సర్కిల్ మీదుగా సాగింది. యాడ్స్ ఆన్ త్రీడీ ఫ్యాన్, త్రీడీ వాకర్స్ ద్వారా వీడియోల ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు.

లోన్‌యాప్, హనీట్రాప్, లాటరీల పేరుతో మోసాలు, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, రూ.10 లక్షలు పెట్టుబడి పెడితే 10 కోట్లు ఇస్తామని చెప్పడం తదితర మోసాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరం జరిగిన తక్షణమే 1930కి ఫోను ద్వారా తెలపాలన్నారు. కార్యక్రమంలో చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, సైబర్ క్రైం, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రం లీకేజీపై కేసులు నమోదు చేయాలి



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్ఎస్ఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి గణితం ప్రశ్నాపత్రం లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్న పత్రం లీకేజీ వ్యవహారంలో అసలు సూత్రదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం సిండికేట్ అయి వారి స్వలాభం కోసం ప్రశ్నపత్రాలు లీకేజీ చేసి ప్రభుత్వ ఉపాధ్యాయులపై నెట్టడం సరికాదన్నారు. ఇదంతా ప్రైవేటు పాఠశాలల ఒప్పందంతోనే జరిగిందని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంల ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్, కార్యదర్శి రెడ్డిసాయి, నాయకులు హరికృష్ణ, సన్ని, హరి, షఫి, భార్గవ్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పరిశోధన సంస్కృతి పెంపొందాలి : వీసీ

కడప ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో వినూత్న పరిశోధన సంస్కృతిని పెంపొందించాలని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు అల్లం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం వైవీయూలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. జాతీయ విద్యావిధానం 2020లో భాగంగా విద్యార్థుల సంపూర్ణ ప్రగతికి విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, వృక్ష శాస్త్రం, జంతు శాస్త్రం, బయోటెక్నాలజీ, గణిత శాఖలను సందర్శించారు. శాఖల వారీగా వారివారి విభాగాల అభివృద్ధిపై వివరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ విద్యార్థులు విశ్వవిద్యాలయం గురించి బయటికి వెళ్లిన తరువాత స్థానిక, గ్లోబల్ సమస్యలను పరిష్కరించేలా మనం తయారు చేయాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసరు పద్మ, డైరెక్టరు డాక్టర్ సుబ్రమణ్యంశర్మ పాల్గొన్నారు.

ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా ఇలియాస్‌బాషా

కడప ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ ఇలియాస్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఎన్నికల పరిశీలకులుగా ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మల్లు రఘునాథరెడ్డి హాజరయ్యారు. జిల్లా సెక్రటరీ జనరల్‌గా ఏపీటీఎఫ్ ఆర్.అబ్దుల్లా, ఆర్థిక కార్యదర్శిగా ఏపీటీఎఫ్ శ్రీనివాసులరెడ్డి ఎంపికయ్యారు. కో చైర్మన్‌లుగా జీవీ సుబ్బారెడ్డి, రామచంద్రబాబు, ఎం.జుబేర్ అహ్మద్, డిప్యూటీ సెక్రటరీలుగా ఎం.విజయకుమార్, వి.శ్యామలాదేవిలను ఎన్నుకున్నారు.

సైన్స్‌పరీక్షకు 99 శాతం మంది హాజరు

కడప ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి బయాలాజికల్ సైన్స్ పరీక్షకు 99 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు జీవశాస్త్రం పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 27723 మంది హాజరు కావాల్సి ఉండగా 27595 మంది (99శాతం) హాజరయ్యారు. 128 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులకు సంబంధించి 191 మందికి 79 మంది హాజరై 20 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 72 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్ 87 కేంద్రాలు, జిల్లా పరిశీలకులు డి.మధుసూదనరావు 7 కేంద్రాలు, జిల్లావిద్యాశాఖాధికారి మూడు కేంద్రాలను పరిశీలించారు.

60 శాతం అర్జీలు పరిష్కారం : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

కమలాపురం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల్లో 60శాతం అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించామని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పంచాయతీల వారీగా రివ్యూ నిర్వహించారు. ఏ పంచాయతీల్లో ఎన్ని అర్జీలు వచ్చాయి.. ఎన్ని పరిష్కారమయ్యాయి.. పెండింగు ఎన్ని ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కడప రెవెన్యూ డివిజను పరిధిలో జరిగిన రెవెన్యూ సదస్సులో 4423 అర్జీలు వచ్చాయని, అందులో 60శాతం అర్జీలను తహసీల్దార్లు, క్షేత్ర స్థాయి సిబ్బందితో కలిసి సంతృప్తికరంగా పరిష్క రించామన్నారు. మిగిలినవి కోర్టు సమస్యలు, కుటుంబ తగాదాలున్నవి మాత్రమేనన్నారు. ముఖ్యంగా కమలాపురం ఏరియా మిగులు, ఇనాం భూములకు సంబంధించి 500 వరకు అర్జీలు వచ్చాయని, జేసీ సూచనల మేరకు ఎక్కువ శాతం పరిష్కరించామన్నారు. తహసీల్దారు శివరామిరెడ్డి, వీఆర్వోలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఎర్రబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఎన్ఎంయూ కడప డిపో నాయకులు

కడప మారుతీనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప రీజియన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ కడప డిపో అధ్యక్షుడు తొండలదిన్నె జయరాం కోరారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఆర్టీసీ రీజియన్ కమిటీ పిలుపు మేరకు ఎన్ఎంయూ నాయకులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ కడప డిపో కార్యదర్శి శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ పీఎస్‌ఖాన్, సంయుక్త కార్యదర్శి మూర్తి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆడిటింగ్ అధికారి అరెస్టు



ఆడిటర్‌ను తీసుకెళుతున్న కడప మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్ర జ్యోతి): భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డాడన్న కేసులో ప్రభుత్వ ఆడిట్ ఆఫీసర్ మధుకిరణ్‌రెడ్డిని పోలీసులు శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన భవనం వద్ద అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరులో అసిస్టెంట్ ఆడిటింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న మధుకిరణ్‌రెడ్డి రెండు రోజుల క్రితం డిప్యూటేషన్‌పై శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ఆడిటింగ్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈనెల 17న కడప మహిళా పోలీస్‌స్టేషన్‌లో మధుకిరణ్‌రెడ్డిపై ఆయన భార్య ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా కడప మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన భవనం వద్దకు చేరుకున్నారు. విధుల్లో ఉన్న అసిస్టెంట్ ఆడిటింగ్ అధికారి మధుకిరణ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని 1టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి కడప మహిళా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఏపీ రవీంద్ర



ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న రవీంద్ర

మైదుకూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ నేత అందె పాపయ్యగారి రవీంద్రను నియమించారు. రాష్ట్ర ప్రభుత్వం 47 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్లను నియమిస్తూ అధికారికంగా జాబితాను విడుదల చేసింది. అందులో మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రవీంద్రను ఎంపిక చేశారు. శుక్రవారం ఆయన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ప్రొద్దుటూరులోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చినందుకు శాలువ కప్పి పూలమాల వేసి సత్కరించారు.

అసౌకర్యాల జగనన్న కాలనీ

● అసాంఘికాలకు అడ్డాగా మారిన వైనం ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



వీధిలైట్లు, రోడ్లు లేని జగనన్న కాలనీ

సీకేదిన్నె, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లపల్లె సమీపంలో ఉన్న జగనన్న కాలనీ ప్రజలు అసౌకర్యాలతో అల్లాడుతున్నారు. తమ సమస్యను ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. అప్పటి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా గ్రామాలను నిర్మిస్తామని పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. అయితే స్థలాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు, తాగునీరు, వీధిదీపాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జగనన్న కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

● అసాంఘికాలకు అడ్డాగా..

జగనన్న కాలనీ అసౌకర్యాలతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాయంత్రం అయితే మందుబాబులు ఇక్కడకు చేరి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ విషయమై పోలీసులకు ఫోన్ చేసినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీధి లైట్లు ఏర్పాటు చేయాలి..



జగనన్న కాలనీలో వీధి లైట్లు లేక రాత్రి పూట అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు స్పందించి వీధిలైట్లు, రోడ్లు ఏర్పాటు చేసి ప్రజలకు సహకరించాలి.

- దర్బార్‌బీ, జగనన్న కాలనీ

నీటి సమస్యను తీర్చాలి..



జగనన్న కాలనీలో నీటి సమస్య విపరీతంగా ఉంది. బోర్లు ఉన్నప్పటికి అధికారులు మంచినీటి సౌకర్యం అందించకపోవడంతో ప్రజలు ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. మరోవైపు ట్యాంకర్లు కొనుగోలు చేయలేనివారు ఇళ్లు ఖాళీ చేసి వెళుతున్నారు. అధికారులు రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలి.

- శ్రీనివాసులు, జగనన్న కాలనీ

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం

● గ్రీవెన్స్‌డేలో ఎస్పీ అశోక్‌కుమార్



కానిస్టేబుల్‌ను సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత స్పౌస్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి ఎస్పీకి స్వయంగా విన్నవించారు. స్పీ సిబ్బంది సమస్యలు విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని ఎస్పీ అశోక్‌కుమార్ సిబ్బందికి భరోసా ఇచ్చారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

వారపుసంత వేలం రూ.5.38లక్షలు

సింహాద్రిపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నెలలో ప్రతి ఆదివారం సింహాద్రిపురంలో జరిగే వారపుసంత 2025-2026 సంవత్సరానికి సంబంధించిన వేలంపాటలో రూ.5,38,500 పలికింది. ఈ వేలంపాటలో 8మంది పాల్గొనగా ఓ.వెంకటరెడ్డి ఎక్కువ మొత్తంలో వేలం వేసి దక్కించుకున్నారు. గతేడాది రూ.4,20,500 కాగా ఈసారి రూ.1.18 లక్షలు ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పద్మనాభరెడ్డి, పంచాయతీ ఈవో జి.వెంకటరాముడు, జూనియర్ అసిస్టెంటు పుష్పవేణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు చెన్నూరు మార్కెట్‌కు వేలంపాట

చెన్నూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు మార్కెట్ వేలంపాటను ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి బి.రామసుబ్బారెడ్డి తెలిపారు. కూరగాయల మార్కెట్, బస్టాండు, రూములు, జంతు వధశాలను అద్దెకు ఇచ్చేందుకు వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగలవారు శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

ఇంకుడు గుంతల కోసం దరఖాస్తు చేసుకోండి

వల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వల్లూరు పంచాయతీ ప్రజలు, రైతులు ఇంకుడుగుంతల కోసం దరఖాస్తు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఇంటి బయట కానీ, ఆరుబయట కానీ పాత్రలు కడిగిన నీరు, లేదా బట్టలు ఉతికిన నీరు రోడ్డుపై పారరాదన్నారు. అలాచేస్తే పంచాయతీరాజ్ యాక్టు ప్రకారం అపరాధ రుసుము వేస్తామని తెలిపారు. పరిసరాల శుభ్రతకు అందరూ సహకరించాలని కోరారు. ఇంకుడుగుంతల కోసం ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకెళ్లి స్థానిక సచివాలయంలో, ఉపాధి హామీ కార్యాలయంలో దరఖాస్తు చేయాలని తెలిపారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఈవో

వేంపల్లె, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని పరీక్ష కేంద్రాలను డీఈవో షంషుద్దీన్ శుక్రవారం తనిఖీ చేశారు. సైన్స్ రెండో పేపరుపరీక్ష జరిగింది. పరీక్షల ముందు బాలుర హైస్కూలుకు వచ్చిన డీఈవో పరీక్ష పూర్తయ్యే వరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

● చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

కడప మారుతీనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని పుత్తా ఎస్టేట్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డితో కలిసి ఆయన కమలాపురం నియోజవర్గంలో 44 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో దోహదపడుతున్నదన్నారు. అనారోగ్యంతో వైద్యం చేయించుకోలేక అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు భరోసా కల్పించేలా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్నదన్నారు. లబ్ధిదారులకు రూ.50,66,436 చెక్కులను పంపిణీ చేశారు.

టెక్నీషియన్లకు ఊతమివ్వడం ఆనందంగా ఉంది

● కడప ఎమ్మెల్యే మాధవి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్.మాధవి

కడప మారుతీనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా వున్న టెక్నీషియన్‌ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి తద్వారా వారికి ఊతమిచ్చేలా కార్మికశాఖలో అవకాశం కల్పించాలని కోరడం చాలా ఆనందంగా వుందని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి అన్నారు. ప్రధానంగా రిఫ్రిజిరేషన్ టెక్నీషియన్‌లు పడుతున్న ఇబ్బందులకు భరోసా కల్పించాలన్న లక్ష్యంతో అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు. రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్‌కండీషనింగ్ టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌ఏసీటీడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రవీంద్రనగర్‌లోని యూఎస్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడారు. రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రఘురామిరెడ్డి, నగర అధ్యక్షుడు లెక్కల మురళీమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఓ యువతా మేలుకో' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు విడుదల చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఓ యువతా మేలుకో-వ్యసనాలు మానుకో అనే పోస్టరును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి విడుదల చేశారు. శుక్రవారం గోవర్ధనరెడ్డి కార్యాలయంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ రూపొందించిన క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెట్టింగ్ అనేది ఒక విష సంప్రదాయమన్నారు. సరదా కోసం కూడా బెట్టింగ్ జోలికి వెళ్లకూడదన్నారు. కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, ఎన్‌ఆర్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రహ్మతుల్లా, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు లోకేశ్, విశ్వనాథ్, నితీష్, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వాలి

వేంపల్లె, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ రోజున పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్ అధికారులను కోరారు. నాలుగు నెలలుగా పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈవో సస్పెండ్ అయ్యాక ఇన్‌చార్జిని నియమించి పరిపాలన సాగించాలన్నారు. పారిశుధ్యం అధ్వాన్నంగా తయారై తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సమస్యల పరిష్కారం కోసం జిల్లా ఉన్నతాధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.


పోలవరం కాంగ్రెస్ పార్టీ మానస పుత్రిక : తులసిరెడ్డి

వేంపల్లె, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు కాంగ్రెస్ మానస పుత్రిక అని, కాంగ్రెస్ అప్పుడే అధికారంలోకి వచ్చి ఉండింటే ఎప్పుడో పూర్తయి ఉండేదని ఆ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలవరానికి బీజేపీ ఒక శని గ్రహమని, వైసీపీ, టీడీపీలు రాహుకేతువులుగా దాపురించారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం పోలవరాన్ని పూర్తిగా నాశనం చేసిందని, ప్రస్తుతం వచ్చిన కూటమి ప్రభుత్వం మాటలు తగ్గించి కేంద్రమిచ్చే నిధులతో నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి 150 అడుగుల ఎత్తు తగ్గకుండా త్వరగా ప్రాజెక్టును నిర్మించాలని ఆ ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు.

గీత పఠనంతో ఆధ్యాత్మిక జ్ఞానం

● 'గీత పట్టు - రాత మార్చు' లఘు చిత్రం ఆవిష్కరణ

కడప మారుతీనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సాధించాలంటే భగవద్గీతను పఠించడమే ఏకైక మార్గమని ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. నేహా మ్యూజిక్ ఆధ్వర్యంలో కె.బాబుస్వామి నిర్మాతగా నిర్మించిన గీత పట్టు - రాత మార్చు అనే లఘుచిత్రాన్ని శుక్రవారం ఉదయం కడప సమీపంలో ఉన్న రామక్రిష్ణ వానప్రస్థాశ్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందులో ఒక పాత్ర పోషించడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. విశిష్ట అతిథి జి.వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ పుష్పానికి సువాసన ఎంత ముఖ్యమో వృద్ధాప్యానికి ఆధ్యాత్మిక జీవనం అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎంసీ నాగిరెడ్డి, వెల్లాల వెంకటేశ్వరాచారి, సుబ్బిరెడ్డి, ప్రొద్దుటూరు నాగరాజు, సిద్దేశ్వర్, కొండారెడ్డి, భారవి, తులసిరెడ్డి, చిట్టెమ్మ పాల్గొన్నారు.



లఘు చిత్రాన్ని ఆవిష్కరిస్తున్న మూల మల్లికార్జునరెడ్డి తదితరులు

శ్రీరాంనగర్‌లో మురుగునీరు తొలగింపు

వేంపల్లె, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని శ్రీరాంనగర్‌లో రోడ్డుపై ఉన్న మురుగునీరు, కాల్వలోని చెత్త చెదారాన్ని శుక్రవారం తొలగించారు. పారిశుధ్యం అధ్వాన్నం.. అన్న శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ సిబ్బంది శ్రీరాంనగర్ వాటర్ ట్యాంకు వీధికి వెళ్లి అక్కడ ఉన్న మురుగునీటిని తొలగించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వేంపల్లె శ్రీరాంనగర్ రోడ్డుపై చెత్త, మురికినీటిని తొలగించిన దృశ్యం

కార్యదర్శిపై దాడి.. నల్లబ్యాడ్జీలతో నిరసన



వల్లూరు ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

వల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వీఎన్‌పల్లె పంచాయతీకార్యదర్శి నాగభూషణ్‌రెడ్డి ఇంటిపై గత రాత్రి జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం వల్లూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్న తమపై దాడులు చేస్తే సహించేదిలేదన్నారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రెసిడెంట్ కరీముల్లా, వైస్‌ప్రెసిడెంటు ఓబులేసు, ట్రెజరీ శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీ సునీత, తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వీఎన్‌పల్లె పంచాయతీ కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డి ఇంటిపై దాడిని ఖండిస్తున్నామని పంచాయతీ కార్యదర్శుల సంఘం గౌరవ అధ్యక్షుడు లక్ష్మీపతి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ శుక్రవారం మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగభూషణ్ రెడ్డికి రక్షణ కల్పించాలని, దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శులు సుధీర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



పెండ్లిమర్రి ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

శివాలపల్లె సమీపంలో తవ్విన నీటికుంటను పరిశీలిస్తున్న ఎంపీడీవో



నీటి కుంటలతో ఎన్నో ప్రయోజనాలు : ఎంపీడీవో

చెన్నూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే నీటి కుంటల వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని శివాలపల్లె గ్రామ పంచాయతీలో శుక్రవారం నీటి కుంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నీటి కుంటలు సమీపంలో ఉన్న బోర్లలో భూగర్భజలాలు పెరిగేందుకు ఉపయోగపడతాయన్నారు. అలాగే పశువులకు తాగునీటిగా, ఇబ్బందికర పరిస్థితులల్లో రైతులు సాగు చేస్తున్న పండ్ల మొక్కలకు ఈ నీటిని అందించవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల ద్వారా రేషన్ ఇవ్వాలి

● సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

పులివెందుల టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా కానీ ఎండీయూ ఆపరేటర్ల ద్వారా రేషను బియ్యం పంపిణీ చేయాలని కౌన్సిలర్లు కోరారు. డీలర్లు వాళ్ల ఇంటి సమీపంలో ఉన్న రూముల్లోనే స్టాకు తెప్పించుకుని అక్కడ నుంచే పంపిణీ చేయడం ఏమిటని కౌన్సిలర్లు డిప్యూటీ తహసీల్దారు వెంకటరెడ్డిని ప్రశ్నించారు. శుక్రవారం పులివెందుల పురపాలక సభాభవనంలో సర్వసభ్య సమావేశం మున్సిపల్ కమిషనరు రాముడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్‌ఫోర్స్‌మెంటు డిప్యూటీ తహసీల్దారు వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీలో చాలాచోట్ల వీధిదీపాలు వెలగడం లేదని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వేసవిలో మంచినీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు సంబంధించి వివరించారు.

హామీల అమలు కోసం ఆశాల ఉద్యమబాట



సమావేశంలో మాట్లాడుతున్న గుంటి వేణుగోపాల్

కడప మారుతీనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన హామీల అమలు కోసం ఆశాలు ఉద్యమబాట పట్టాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లాగౌరవ అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కార్యాలయంలో యూనియన్ నగర అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన ఏపీ ఆశావర్కర్ల యూనియన్ నగర సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలకు ఇచ్చిన హామీలకు జీవోలు విడుదల చేయాలని, వేతనాలు పెంచాలని, సాధారణ సెలవులు, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండు చేశారు. ఈ విషయమై రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని, ఏప్రిల్ 1 నుండి 21 వరకు ఉద్యమ కార్యాచరణ ప్రకటించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బి.శాంతమ్మ, యూనియన్ నాయకులు రాణి, వెంకటకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ.. కేసు నమోదు

చక్రాయపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట మండలం కల్లూరుపల్లి గ్రామం కట్టగంటవారిపల్లెలో దాయాదుల మధ్య భూతగాదా చిలికిచిలికి ఘర్షణకు దిగి గాయపరచుకున్నారు. అనంతరం కేసులు నమోదు చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. కల్లూరుపల్లి గ్రామం కాట్లగంటవారిపల్లెలో శుక్రవారం రాత్రి దాయాదులైన కోనేటి అంజనప్పనాయుడు, కోనేటి రామచంద్రనాయుడు మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో కోనేటి అంజనప్పనాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే మరొకరికి గాయాలు కాగా రామచంద్రనాయుడు వర్గంలో స్వల్పగాయాలయ్యాయని, ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్ఐ క్రిష్ణయ్య తెలిపారు.

బలిజలందరూ ఐక్యంగా ముందుకు సాగాలి



క్యాలెండరు ఆవిష్కరిస్తున్న బలిజ సంఘం నాయకులు

వేంపల్లె, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బలిజలు ఐకమత్యంగా ముందుకు సాగినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని బలిజ సంఘం నేతలు తెలిపారు. రాయల్ కాపునాడు ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సరం తెలుగు నూతన క్యాలెండరును స్థానిక బలిజ సంఘం గౌరీదేవి ఆలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. కాపునాడు ప్రతినిధులు కావలి క్రిష్ణతేజ, వీరా, వేంపల్లె బలిజ సంఘం గౌరవాధ్యక్షులు కె.రెడ్డయ్య, అధ్యక్షులు కుళ్లాయప్ప, చంద్రశేఖర్, నందిమండలం ప్రసాద్, మారుతీ, డాక్టర్ రంగయ్య, రవిశంకర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న బీటెక్ రవి సతీమణి లతారెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇస్లాంపురంలో వార్డు ఇన్‌చార్జ్ రహ్మతుల్లా ఆధ్వర్యంలో పేద ముస్లిం మహిళలకు శుక్రవారం దుస్తుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి లతారెడ్డి, రెడ్డిపల్లె రామనాథరెడ్డి, పులివెందుల సీనియర్ నాయకుడు తుగుట్ల సిద్ధారెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దూరు వెంకట్రాంరెడ్డి, నల్లగారి భాస్కర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు మాబుబాషా ముఖ్యఅతిథులుగా హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇస్మాపురం రఫీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లీకేజీ నీటికి అడ్డుకట్ట



దువ్వూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు గ్రామ పంచాయతీలో పైపు లైను లీకేజీని గ్రామ పంచాయతీ అరికట్టింది. ఈనెల 25వ తేదీన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'లీకేజీ నీటిని వెంటనే అరికట్టండి' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీనికి స్పందించిన పంచాయతీ సెక్రటరి సత్యనారాయణ, సర్పంచ్ చెన్నరాయుడు సిబ్బందిని పురమాయించి లీకేజీని అరికట్టడంతో పాటు అక్కడ వాల్వ్ ఏర్పాటు చేసి చుట్టూ ప్రహరీ కట్టి పైన మూత వేయించారు. దీంతో సమస్య పరిష్కారం అయింది.

మెటల్ రోడ్డుకు రూ.25 లక్షలు మంజూరు

దువ్వూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం గొల్లపల్లె పొలాల మీదుగా కఠిక పల్లె వరకు మెటల్ రోడ్డు నిర్మాణానికి రూ.25 లక్షలు నిధులు మంజూరైనట్లు మండల పంచాతీరాజ్‌శాఖ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. ఈ నిధులతో సుమారు ఒకటిన్నర కిలో మీటరు పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంకు సంబందించిన నిధులు మంజూరయ్యాయని వివరించారు.

31 లోపు దరఖాస్తు చేసుకోండి

మైలవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మైలవరంలోని బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, 8వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పిన్సిపాల్ సావిత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందు లో 5వ తరగతి ప్రవేశానికి 80 సీట్లు, 8వ తరగతిలో మిగిలి ఉన్న ఖాళీలకు సంబంధించి ప్రవేశ పరీక్షకు ఉంటుందన్నారు. విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

నూతన సచివాలయ భవనం ప్రారంభం

మైలవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎం.కంబాలదిన్నెలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ఎంపీడీవో రామచంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రూ.40 లక్షలతో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ సచివాలయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఐదుగురిపై దాడి కేసు నమోదు

ప్రొద్దుటూరు , మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గోపవరం పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక సందర్భంగా దాడికి పాల్పడ్డారన్న ఘటనపై ఐదుగురు పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. గోపవరం వార్డు మెంబర్లను పంచాయతీ కార్యాలయంకు తీసుకెళుతుంటే టీడీపీ నాయకులైన తోట మహేశ్వరరెడ్డి అలియాస్ పర్లపాడు మహేశ్వరరెడ్డి, బచ్చల ప్రతాప్, చీమల రాజశేఖరరెడ్డి ,నవీన్ రెడ్డి, పగిడాల దస్తగిరి అనే వారు మరో 46 మంది అనుచరులతో రాళ్ళ దాడి చేశారని డ్రైవరు మేరువ హరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోండి

బి.కోడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో భాస్కర్‌రావు, ఈవోపీఆర్డి కెనడీ పేర్కొన్నారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామంలో ప్రతి ఇంటికీ తిరిగి పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఇంటి వద్ద ఉన్న చెత్తను ఎక్కడంటే అక్కడ వేయకుండా ఒక చోట వేస్తే దాన్ని గ్రీన్ అంబాసిడర్లు తొలగిస్తారని అప్పుడు గ్రామమంతా పరిశుభ్రంగా ఉంటుందని దీని వల్ల రోగాలు రాకుండా జాగ్రత్త పడవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సెక్రటరీ , గ్రీన్ అంబాసిడర్లు, ప్రజలు పాల్గొన్నారు.

అధ్వానంగా పంచాయతీ రోడ్లు

ముద్దనూరు మార్చి 28(ఆంధ్రజ్యోతి):పంచాయతీ పరిధిలోని రహదారులు కంకరతేలి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్లపై వెళ్లాలంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ముద్దనూరు మండలంలోని నల్లబల్లె గ్రామం నుంచి రాజులగురువాయపల్లెకు వెళ్లే దారిలో పొలాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో రాజులగురువాయపల్లె, నల్లబల్లె గ్రామ రైతులు పొలాలకు వెళ్లాలంటే సరైన దారి లేకపోవడంతో దాదాపు 10 సంవత్సరాల క్రితం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఇక్కడి రైతులు దారి లేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి తారు రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో రాజులగురువాయపల్లె గ్రామస్థులకు పొలాలకు వెళ్లేందుకే కాకుండా ముద్దనూరు టౌన్‌కు వచ్చేందుకు చాలా తక్కువ ప్రయాణం ఉంటుంది. ప్రస్తుతం ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతిని ఇక్కడ తారు రోడ్డు ఉండేదా? అని గుర్తు పట్టని విధంగా తయారైంది. అలాగే బొందలకుంట గ్రామం నుంచి బడుగువారుపల్లెకు ఎప్పుడో తారు రోడ్డు వేశారు. అయితే ప్రస్తుతం ఆరోడ్డు పూర్తిగా దెబ్బతిని తారు పోయి గులకరాళ్లు బయటపడి వాహనదారులు కాదుకదా పాదాచారులు అటు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. ఈ గ్రామ ప్రజలు ముద్దనూరు టౌన్‌కు ఈ రోడ్డు మీదుగా బొందకుంట మీదుగా వస్తుంటారు. ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డు మీదుగా ప్రయాణం చేయాలంటే చాలా అవస్థలు పడుతున్నారు.అయితే ఈ రెండు రోడ్లు పంచాయతీ రోడ్లు కావడంతో అభివృద్ధికి శాపంగా మారాయి.



గులకరాళ్లతో అధ్వానంగా దర్శనమిస్తున్న నల్లబల్లె ,రాజులగురువాయపల్లె రోడ్డు

రైతుల సమస్యలు గుర్తించి రోడ్డు వేశారు

రైతులు పొలం వద్దకు వెళ్లేందుకు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని అప్పటిలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి గుర్తించి నల్లబల్లె నుంచి రాజులగురువాయపల్లె వరకు తారు రోడ్డు ఏర్పాటు చేశారు. రాజులగురువాయపల్లె ప్రజలతో పాటు నొస్సంవారిపల్లె, పెనికెలపాడు, రాఘవాపురం గ్రామ ప్రజలు ముద్దనూరు కు వెళ్లాలంటే చాలా దగ్గర మార్గం ఇది.ప్రస్తుతం రోడ్డు పూర్తిగా దెబ్బతినింది.

-కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజులగురువాయపల్లె

రోడ్ల కోసం ప్రతిపాదనలు పంపాం

ముద్దనూరు మండల పరిధిలోని రాజులగురువాయపల్లె, నల్లబల్లె రోడ్డు 4కిలోమీటర్లకు సంబందించి నాబార్డు నిధులు రూ.2 కోట్లు కావాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. బొందలకుంట, బడుగువారిపల్లె రోడ్డుకు ప్రతిపాదనలు పంపడం జరిగింది.

-:మునికుమార్, పీఆర్ ఏఈ,ముద్దనూరు

ఎర్రగుంట్లలో పట్టపగలు చోరీ

● బంగారు, నగదు, బాండ్లు అపహరణ

ఎర్రగుంట్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల పట్టణంలో పట్టపగలే చోరీ జరిగింది. వివరాలిలావున్నాయి .ఎర్రగుంట్ల వినాయకనగర్‌కు చెందిన దనికుల పీరయ్య, అతని భార్య నాపరాయి పరిశ్రల్లో పనిచేస్తున్నారు. శుక్రవారం భార్య పాలీష్‌మిషన్‌లోకి పనికి వెళ్లగా, పీరయ్య నాపరాయి లారీ అన్‌లోడింగ్‌కు వెళ్లాడు. అతని కుమార్తె మధ్యాహ్నం 12.30గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి తాళాలు ఇంటి ఆవరణలోనే దాచి వెళ్లింది. ఇది గమనించిన వారు తాళం తీసి బీరువాలో ఉన్న బంగారు, నగదు, బాండ్లు చోరీ చేశారు. రెండు గంటల ప్రాంతలో సీరయ్య భార్య ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో చోరీ జరిగిన సంగతి గమనించి భర్తకు తెలపడంతో అతను తిరిగి వచ్చి ఇంట్లో చూడగా హారం, సరుడు, చైన్, జత కమ్మలు, మాటీలు, రెండు ఉంగరాలు, బాండ్లు 5, డబ్బులు చోరీ జరిగినట్లు గమనించారు. ఈవిషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పీరయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి ఇంటిపై దాడి తగదు

పోరుమామిళ్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) :.పంచాయతీ కార్యదర్శి ఇంటిపై దాడి తగదని పోరుమామిళ్ల పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు సుందర్‌కుమార్, ఓబులేసు, రాజీవ్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డిలు అన్నారు. వీరపునాయునిపల్లె పంచాయతీ కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమణారెడ్డికి వినతిపత్రం అందించారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎర్రగుంట్లలో: వీరపునాయునిపల్లె మండలంలో పనిచేస్తున్న కార్యదర్శిపై దాడినికి నిరసనగా ఎర్రగుంట్ల మండలంలోని కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎర్రగుంట్ల ఎంపిడీవోకార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వీయన్‌పల్లెలో పనిచేస్తున్న కార్యదర్శి ఇంటిపై దాడి చేయడం దారుణమని వారు ఖండించారు. సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో వెంకటరమణయ్య, ఈవోఆర్డీ రంతుల్లయ్యకు వినతిపత్రాన్ని ఇచ్చారు.

నల్లబ్యాడ్జీలతో గ్రామ కార్యదర్శుల నిరసన

చాపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చాపాడులోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా శుక్రవారం గ్రామ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వీరపునాయునిపల్లె మండలంలోని బుసిరెడ్డిపల్లె గ్రామ కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డిపై దాడికి వ్యతిరేకంగా వారు నిరసనవ్యక్తం చేశారు. దాడి చేసిన విద్యుత్తు ట్రాన్స్‌కో లైన్‌మెన్ వరప్రసాద్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని గ్రామ కార్యదర్శులు చంద్రశేఖర్, సుధాకర్, శ్రీనివాసులరెడ్డి, జానకీరాం తదితరులు కోరారు.

ప్రొద్దుటూరు రూరల్‌లో: ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత, భరోసాను కల్పించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం డిమాండ్ చేసింది. వీరపునాయునిపల్లె మండలం పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డిపై దుండగుల దాడిని ఖండిస్తూ శుక్రవారం ప్రొద్దుటూరు మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శుల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి కార్యదర్శులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి బాలన్నకు వినతి పత్రం అందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మస్తాన్, మహిళా ఉపాధ్యక్షురాలు శిరీష, జనరల్ సెక్రటరి సుబాషిణి, అదనపు సెక్రటరి కిరణ్, పంచాయతీ కార్యదర్శులు (1-6గ్రేడ్) పాల్గొన్నారు.

రాజుపాలెంలో:వీరపునాయునిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డి ఇంటిపై దాడి చేయడం హేయమైన చర్య అని రాజుపాలెం పంచాయతీ సెక్రటరీల సంఘం నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేయించే విషయంలో పంచాయతీసెక్రటరీ సహకరించడంలేదని దుండగులు దాడికి దిగడం హేయమైన చర్యఅని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమణారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శులు నిరంజన్, బాబు, నాగార్జున పాల్గొన్నారు.

ఘనంగా కొండారెడ్డి జన్మదిన వేడుకలు

ప్రొద్దుటూరు , మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఏకైక కుమారుడు నంద్యాల కొండారెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ కార్యకర్తల నడుమ ఘనంగా నిర్వహించారు. రాబోయే రోజుల్లో వరదరాజులరెడ్డి వారసుడుగా క్రియాశీల రాజకీయాల్లో ముందుండే యువనాయకుడు కొండారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలందరికి స్వీట్లు పంచిపెట్టారు. ప్రొద్దుటూరు భవిష్యత్తును కాపాడగలిగిన నాయకుడు నంద్యాల కొండారెడ్డి అని టీడీపీ నాయకులు వంగల నారాయణరెడ్డి రసూల్ గౌస్ మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మార్తల సుధాకర్ రెడ్డిలు పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి జితేందర్‌సింగ్‌ను కలిసిన నేతలు



కేంద్ర మంత్రిని కలిసిన రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి జితేంధర్‌సింగ్‌ను రాష్ట్ర మంత్రి సత్యకుమార్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కలిశారు. ఢిల్లీలో శుక్రవారం ఆస్పిరేషనల్ జిల్లా అయినటువంటి కడపజిల్లాకు ఇన్‌చార్జి, కేంద్ర మంత్రి జితేందర్‌సింగ్‌ను కలిసి సమస్యలు తెలిపినట్లు వారు పేర్కొన్నారు. వారితోపాటు బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు చదిపిరాళ్ల డాక్టర్ రాజేష్‌రెడ్డి, జాతీయ నాయకుడు పనతల సురేష్, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి కలిశారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని నీటిపారుదల, విద్యుత్తు , రోడ్లు, భవనాలు, విద్య, వైద్యం, పంచాయతీరాజ్ శాఖ సంబందించిన సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కోరినట్లు వారు తెలిపారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు



పెద్దమసీదులో మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న భూపేష్‌రెడ్డి

ఎర్రగుంట్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో పుణ్యకార్యమని టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఎర్రగుంట్ల ముద్దనూరు రోడ్డులోని జామియా మసీదులో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన రోజా ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందుఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఎన్‌డీఏ మండల ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు ఎస్.సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరులో:మండలంలో టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.టీడీపీ మండల శివరామిరెడ్డి ముద్దనూరులోని మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు బాక్సుడును అందజేశారు. అలాగే మండలంలోని ముద్దనూరుటౌన్‌లోని మూడు మసీదులు, ఉప్పలూరు, యామవరం మసీదులకు సంబందించి ముస్లింలకు పంపిణీ చేశారు. కేశవరెడ్డి, జగదీశ్వరరెడ్డి, శేఖర్‌నాయుడు, చంద్ర ఓబుళరెడ్డి,రంగారెడ్డి, నాగేశ్వరరావు, ఆది, శ్రీకాంత్ బాబురెడ్డి పాల్గొన్నారు.

భూమి మార్పిడిపై ఆర్డీఓ విచారణ

కలసపాడు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలంలోని శంఖవరం గ్రామపొలాల్లో శుక్రవారం బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ భూమిమార్పిడిపై, సిద్దమూర్తిపల్లె గ్రామంలోని ల్యాండ్ కన్వర్షన్‌పై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధురవాణి, ఆర్ఐ సిందూజ, డీటీ మోహన్ రాజు, సర్వేయర్ జోషి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీరు వృథా చేయడం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

బద్వేలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):వేసవిలో నీటిని వృథా చేయడం తగదని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డు అమెనిటీస్ సెక్రటరీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్రమ కుళాయిల కనెక్షన్లు పునరుద్ధరించుకోవాలని తెలిపారు. రంజాన్ పర్వదినం సందర్భంగా మసీదుల వద్ద మౌలిక సదుపాయాలతోపాటు లైటింగ్ సిబ్బంది వార్డులలో తిరుగుతూ లైటింగ్ సమస్య లేకుండా చూడాలన్నారు. మున్సిపల్ ఏఈలు మహేష్, బాబు, అమెనిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

బస్టాండు వేలం వాయిదా

ముద్దనూరు మార్చి28(ఆంధ్రజ్యోతి):బస్టాండు వేలం శనివారానికి వాయిదా వేసినట్లు ఈవో నరసింహులు తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం , జంతువధశాలకు సంబంధించి 2025-26 సంవత్సరం కు గేటు వసూళుకు వేలం పాట నిర్వహించగా జంతువధశాలకు వేలం పాట ని లో రూ.3,25000 మంటి లక్ష్మీదేవి దక్కించుకున్నారన్నారు. గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం జంతువధశాలలో ఒక్కొక్క జీవానికి రూ.100, చికెన్ సెంటర్‌కు రోజుకు రూ.10చొప్పున గేటు వసూళ్లు కేటాయించడం జరిగిందని ఈవో నరసింహులు తెలిపారు.

వైభవంగా అగస్త్యేశ్వరస్వామి కల్యాణం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంలో గంగాగౌరీ సమేత అగస్త్యేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు తెల్లవారుజాము నుంచి స్వామివారికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగాగౌరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ కాలక్షేప మండంలో ఆశీలను చేశారు. వేద పండితులు వేద మంత్రోచ్చారణలతో స్వామివారి కల్యాణంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈవో రామచంద్రాచార్యులు, పాలక మండలి సభ్యులు, వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఈకేవైసీ గడువు పొడిగించాలని వినతి

జమ్మలమడుగు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆధార్ ఈకేవైసీ గడువు పొడిగించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి శిరీషకు జమ్మలమడుగు ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మేకల ఆంజనేయులు తదితరులు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం జమ్మలమడుగులో ఆయన మాట్లాడుతూ ఆధార్‌కార్డు అప్‌డేట్ సర్వర్ నిదానంగా ఉండడంతో ఈకేవైసీ గడువు పొడిగించాలని జిల్లా పౌరసరఫరాల అధికారికి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. అయిదు సంవత్సరాలపైబడిన పిల్లలు మార్చి 31వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని లేనిచో రేషన్, సంక్షేమ పథకాలకు ఇబ్బందులు ఎదురవుతాని చెప్పడం జరిగిందన్నారు. ఈకేవైసీ వెంటనే గడువు పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ప్రజల ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు

● కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్ల ఆవేదన



కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ శివమ్మ

జమ్మలమడుగు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీలో తాగునీటి సమస్యలు అన్నీ ఇన్నీ కావని కౌన్సిలర్లు బానా శివరామలింగారెడ్డి, ముల్లాజానీ, సింగరయ్య, మునిసుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జమ్మలమడుగు మున్సిపల్ సాదారణ సమావేశం ఛైర్‌పర్సన్ శివమ్మ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో కౌన్సిలర్ బానా శివరామలింగారెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు, ప్రస్తుతం ఎన్టీఆర్ కాలనీల్లో ప్రజలు మంచినీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత జగనన్న కాలనీ, ప్రస్తుతం ఎన్టీఆర్ కాలనీలో మున్సిపాలిటీ సిబ్బంది రూ.2,500 డబ్బులు తీసుకుని చేతివాటం ప్రదర్శిస్తూ కుళాయి కనెక్షన్లు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ కాలనీలో కుళాయి కనెక్షన్ ఉచితంగా వేసుకోవచ్చన్నారు. అక్కడ ఎవరైనా డబ్బులు తీసుకుంటుంటే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వైస్‌ఛైర్మన్-2 సింగరయ్య మాట్లాడుతూ అధికారులు ఆయా వార్డులకు వచ్చినప్పుడు కౌన్సిలర్లను పిలువకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. పాత బిల్లులు పెట్టకుండానే కొత్త బిల్లులకోసం మున్సిపల్ సమావేశాలు నిర్వహిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ మునిసుబ్బారెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగు పట్టణంలో డీకేటీ స్థలాల్లో కొందరు ఆక్రమించి ఫంక్షన్ హాళ్లు, ఇతరత్రా నిర్మాణాలు చేస్తున్నారని వెంటనే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు మేల్కొని వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్షుమయ్య

చాపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):ప్రస్తుత వేసవి ఎండలు మండుతుండడంతో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని మండలాధ్యక్షుడు లక్షుమయ్య అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాయలంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షత నిర్వహించారు. కాగా అయ్యవారుపల్లె గ్రామంలో శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని ఆ గ్రామ ఎంపీటీసీ రమాదేవిని కోరారు. సాగు నీటి సంఘాల ద్వారా కాలువల్లో ఆధునికీకరణ పనులు చేసేందుకు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు చాపాడు చానెల్ ఏఈ గురుమోహన్ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చెరువులకు ఆధునికీకరణ పనులు చేస్తున్నట్లు ఏపీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. రైతులకోసం సబ్సిడీతో పండ్లతోటల మొక్కలు, పూలమొక్కలు, గడ్డి పెంచుకునేందుకు ప్రభుత్వం సహాయం చేస్తున్నట్లు ఏపీవో చెప్పారు. ఉపాధి కూలీలకు తాగునీరు, మజ్జిగ, నీడ కల్పించాలని ఎంపీడీవో కోరారు. సమావేశంలో అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జమ్మలమడుగు ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లడుతూ జీవితంలో విజయం సాధించాలంటే ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని సూచించారు. సోషల్‌మీడియా, ఇంటర్నెట్ మనకు అవసరమైన విషయాలు నేర్చుకోవడానికి ఉపయోగించాలన్నారు. తహసీల్దారు గంగన్న మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. కళాశాల ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలని సూచించారు. కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన, చదువులో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు వీరకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాచమల్లు ధనదాహంతోనే బీసీలకు అన్యాయం

● ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదాకు కారణం అతనే

● ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆరోపణలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ధనదాహం వల్లే గోపవరం ఉప సర్పంచ్ బీసీలకు దక్కనీయకుండా కుట్ర చేశాడని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోపించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యా లయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోపవరం సర్పంచ్ ఎన్నిక సందర్భంగా ఉపస ర్పంచ్ పదవి కావాల్సిన వారు డబ్బులు పెట్టుకోమని చెప్పి బీరం రాఘవేంద్రరెడ్డి, కొండయ్యలతో చేరి సగం ఖర్చు రాచమల్లు పెట్టించారన్నారు. తిరిగి ఆలస్యంగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక బీసీ మహిళ రమాదేవికి ఉపసర్పంచ్ పదవి కట్టబెట్టకుండా మళ్ళీ బీరం రాఘవేంద్రారెడ్డితో డబ్బులు తీసుకొని బీసీ మహిళకు అన్యాయం చేసిన నీచుడు రాచమల్లు అన్నారు. నిన్న ఉపసర్పంచ్ ఎన్నిక కోరం లేకపోవడంతో మొదటి రోజు వాయిదా పడిందన్నారు. ఎన్నిక సమయంలో రమాదేవి తనకు అన్యాయం జరగడంపై ఆవేదన చెంది అక్కడ గొడవ చేసిందన్నారు. ఆవాతావరణానికి ఎన్నికల అధికారి రామాంజనేయులురెడ్డికి అనారోగ్యంతో గుండెపోటు వచ్చి ఎన్నికనువాయిదా వేశారన్నారు.దీనికి రాచమల్లు ధనదాహం తప్ప మరొకటి కాదన్నారు. రిటైర్డ్ ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఎన్నికను వాయిదా వేయించాడని రాచమల్లు మాట్లాడుటం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు పగిడాల దస్తగిరి, మాజీ కౌన్సిలర్ వద్దిబాలుడు, మాజీ ఎంపీటీసీ చంద్ర ఓబులరెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

104 వాహనాన్ని తనిఖీ చేసిన జిల్లా అధికారి

బి.కోడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాయలకుంట్ల విలేజీ హెల్త్ క్లినిక్ దగ్గర ఉన్న 104 వాహనాన్ని జిల్లా ఎన్‌టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్ బాలాంజనేయులు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులు రోజుకు ఎంత మంది వస్తున్నారు, వారికి ఏఏ మందులు ఇస్తున్నారు, మందులు ఏమైనా తక్కువగా ఉన్నాయా, వాహనంలో ఏసీ పనిచేస్తుందా? ఓపీ, రిజిస్టరు, ఈసీజీ పనిచేస్తుందా? అని అడిగి తెలుసుకున్నారు. 104 వాహన లాగ్ రిజిస్టరు తదితర రికార్డులు తనిఖీ చేసి వారికి సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఆయన వెంట వైద్యాధికారులు వినీత్‌కుమార్ రాజు, హెల్త్ అసిస్టెంటు రామతీర్థం, ప్రియదర్శిని, లక్ష్మి, నాగేశ్వర్‌రెడ్డి, వాహన పైలెట్ రాజేశ్ పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా చెత్తసేకరణ జరగాలి

కాశినాయన మార్చి28(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో చెత్తసేకరణ క్రమం తప్పకుండా జరగాలని ఎంపీడీవో డాక్టర్ మైథిలీరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె స్థానిక సర్పంచ్ బి.చిన్న ఖాజావలితో కలిసి నర్సాపురంలో జరుగుతున్న చెత్తసేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన ప్లాస్టిక్ బుట్టల్లో తడి పొడి చెత్తను వేరుచేసి హరిత రాయబారులకు అందజేయాలని చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరాదన్నారు.కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలని మూమెంట్‌ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం పేర్కొన్నారు. శుక్రవారం వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ఆలిండియా ముస్లిం పట్టణం లాబోర్డు దేశవ్యాప్తంగాచేపట్టిన నిరసనలలో భాగంగా ఎంపీజే ఆధ్వర్యంలో ముస్లింలు నల్లబ్యాడ్జీలు దరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్ర ప్రభుత్వాలు వారి వారి ఎంపీలతో వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయించాలని కోరారు. జమా అతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షులు హుస్సేన్ అహమ్మద్, అల్లాబకాష్, రహమతుల్లా, జాఫర్, షరీఫ్, ఇంతియాజ్, రసూల్ పాల్గొన్నారు.